రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

• కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

గుండాల వద్ద కాల్వను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ల్దండ, ఆగస్టు 13 : రైతు, వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం చేయడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విమర్శించారు. వెల్దండ మండలంలోని గుండాల గ్రామంలో కేఎల్‌ఐ డీ-82 కాల్వను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏడాది ఏప్రిల్‌లోనే సాగునీరు, తూములు, అలుగుల మరమ్మతులు, విత్తనాలు, ఎరువులు సరఫరా, పంట పెట్టుబడి, 24 గంటల కరెంట్ అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి బడ్జెట్ రూపొందించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఆయన వెంట మాజీ ఎంపీ పీ పుట్టారాంరెడ్డి, విండో డైరెక్టర్ శేఖర్, నా యకులు చల్లా మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రావు, తిర్మల్‌రావు, రవి, హన్మంతునాయ క్, అశోక్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, జంగు, లింగం, కొండల్ యాదవ్, బాలయ్య, రవి, ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య డీడీ

కల్వకుర్తి రూరల్, ఆగస్టు 13 : కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డినారాయణరెడ్డిని నాగర్‌కర్నూల్ జిల్లా పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య డీడీ ధన్‌రాజ్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీ డీ ధన్‌రాజ్ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చి జ్ఞాపికను అందించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కల్వకుర్తికి జిల్లా డీడీగా వచ్చినట్లు ఆయన తెలిపారు. పాడి రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి ఆర్థికాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధన్‌రాజ్

గ్రామాల్లో స్వచ్ఛదనంపై శ్రద్ధ తీసుకోవాలి

• పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క

నాగర్‌కర్నూల్, ఆగస్టు 13 : గ్రామాల్లో స్వచ్ఛదనంపై మరింత శ్రద్ధ పెరగాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులను మంత్రి అభినందించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం, స్వయం సహాయక సంఘాల బలోపేతంపై అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులతో మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాల్లో జిల్లాస్థాయి అధికారుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకు బాగా కష్టపడ్డారన్నారు. మంచి పనితీరు కనబరిచిన సిబ్బందికి ఆగస్టు 15వ తేదీన సన్మానిస్తామని చెప్పారు. మండలాల వారీగా రివ్యూలు చేసి సమగ్ర నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఇక నుంచి ప్రతినెలా మూడు రోజులపాటు స్వచ్ఛదనం-పచ్చదనం డ్రైవ్ కొనసాగుతుందని, పారిశుధ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల వరకు అధికారులు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని చెప్పారు. జీపీ స్పెషల్ అధికారులు ఉదయం కనీసం మూడు గంటలపాటు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరో జత యూనిఫాంలు సిద్ధం చేసి పంపిణీ చేయాలని, మహిళా సంఘాల సభ్యత్వాన్ని కోటి మందికి చేర్చాలన్నారు. గ్రామాల్లో జ్వర సర్వేలు చేసి జ్వర నివారణకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేశ్, జెడ్పీ సీఈవో దేవసహాయం, అదనపు డీఆర్‌డీఏ రాజేశ్వరి పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

వెల్దండ, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ ఇంటర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు ప్రిన్సిపాల్ పుష్పలత, అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి గొప్పవాలు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, మల్లేశ్, నర్సింహ, బుచ్చయ్య, రాఘవేందర్‌గౌడ్, రవిచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, రవీందర్, రేణుక, రమా, సుభా, విష్ణుప్రియా, మంజుల, స్వతి, రవినాయక్ ఉన్నారు.

ఉపకరణాలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి

• డీఈవో గోవిందరాజులు

దివ్యాంగులకు పరీక్షలు నిర్వహిస్తున్న సభ్యులు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 13: ఉపకరణాలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయని డీ ఈవో గోవిందరాజులు అన్నారు. జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షా అభియాన్, కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(ఆలింకో) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత పరికరాల అందజేత కోసం నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇలాంటి శిబిరాల ద్వారా విద్యార్థులకు అందించే ఉపకరణాలు దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 ఏండ్లలోపు 102 మంది దివ్యాంగులకు దాదాపు 12లక్షల విలువ చేసే చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు వంటివి 233 ఉపకరణాలు కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(ఆలింకో) నుంచి వచ్చిన తర్వాత అర్హులకు మరో ప్రత్యేక సమావేశం నిర్వహించి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్, అవినాశ్, మోహన్, ఐఈఆర్‌పీలు, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

పంపిణీకి ఎరువులు సిద్ధం

• పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జనార్దన్‌రెడ్డి

కల్వకుర్తి, అగస్టు 13 : కల్వకుర్తి పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు కావాల్సిన ఎరువులను పంపిణీకి సిద్ధంగా ఉంచామని కల్వకుర్తి పీఏసీసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పీఏసీసీఎస్ డైరెక్టర్లతో కలిసి పీఏసీసీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల, వాటి ధరల వివరాలు వెల్లడించారు. 244 బస్తాల 28:28:0 ఎరువులు అందుబాటులో ఉన్నాయని వీటి ధర బస్తా ఒక్కంటికి రూ.1680 ఉందని చెప్పారు. అదే విధంగా 104 బస్తాల 20:20:0:13, ధర రూ.1130, 793 బస్తాల యూరియా, ధర రూ.266.50, డీఏపీ 50 బస్తాలు ధర రూ.1350, 10:26:26: 420 బస్తాలు ధర రూ.1470, పొటాశ్ 293 బస్తాలు ధర రూ.1530 ఉన్నాయని చెప్పారు. ఎరువులు అవసరమైన రైతులు తమ పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పీఏసీసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ వైస్‌చైర్మన్ శ్యాం, డైరెక్టర్ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• వైద్యాధికారి అనిల్‌కుమార్

లింగాల, ఆగస్టు 13 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని మాడాపూర్‌లో మంగళవారం అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రెండో రోజు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులను వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి వార్డుల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల వారం రోజులుగా మలేరియా, టైఫాయిడ్ తదితర రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి ఎంత మంది రోగాల బారిన పడ్డారో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్

రైతులకు చేరువలో వ్యవసాయశాఖ

అచ్చంపేటరూరల్, ఆగస్టు 13 : వ్యవసాయ శాఖ రైతులకు చేరువ కావడానికి వినూత్న పథకాలను ప్రవేశ పెడుతుందని పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సలహాలు సూచనలు అందించామని జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండలంలోని పుల్జాల రైతు వేదికలో కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో మొక్కజొన్నలో చీడపీడలు నివారణ చర్యలను గురించి వివరించామన్నారు. పంటల సస్యరక్షణపై రైతులకు సలహాలు, సూచనలు చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య, మండలంలోని వ్యవసాయ అధికారులు లక్ష్మణ్‌సింగ్, రవితేజ, విజయ్‌కుమార్, అనూష, వినోద్, రాగాసంధ్య, రైతులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రవి, శ్రీరాములు, ఎల్లారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

కేజీబీవీలో జీఈసీవో తనిఖీ

తిమ్మాజిపేట, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలను జీఈసీవో శోభారాణి మంగళవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బాలికలకు ఉదయం అందించిన అల్పాహారాన్ని పరిశీలించి వారితో కలిసి భుజించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వంటచేసే నిర్వాహకులకు సూచించారు. అనంతరం బాలికలతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

తిమ్మాజిపేట, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి కమల్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల కంపెనీల వివరాలు, ఎక్కడి నుంచి వచ్చాయి, బ్యాచ్ నెంబర్ తదితర విషయాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీలర్లు విధిగా తమ లైసెన్స్‌లను అందరికీ కనిపించేలా దుకాణాల్లో ప్రదర్శించాలని పేర్కొన్నారు. నాణ్యత కలిగిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. నిబంధనలు విరుద్ధంగా అమ్మితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

లెక్చరర్లను నియమించాలి

అచ్చంపేటటౌన్, ఆగస్టు 13 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరతతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన విద్య అందని పరిస్థితి నెలకొన్నదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. రెగ్యులర్ లెక్చరర్ పోస్టుల ఖాళీల ను భర్తీ చేయకపోవడంతోపాటు గెస్ట్ లెక్చరర్లు రాకపోవడంతో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మెరుగైన విద్య అందడంలేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు అధ్యాపకులను త్వరగా నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

12వ వార్డులో ఫైవ్‌మెన్ కమిటీ ఏర్పాటు

అచ్చంపేటటౌన్, ఆగస్టు 13 : అచ్చంపేట పట్టణంలోని 12వ వార్డులో మంగళవారం ఫైవ్‌మెన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచనలతో ఫైవ్‌మెన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ సభ్యులుగా ఆరిఫ్, శేఖర్, నరేశ్, రమేశ్‌గౌడ్, సుజాత, అడ్వైజర్‌లుగా మహబూబ్ అలీ, మక్బూల్, పర్వతాలు, సుశీల, బంధరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామనాథం, నాయకులు రఘురాం, శారద, రాములు, మస్తాన్, శేఖర్, కపిలవాయి శేఖర్, మైనోద్దీన్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

తిమ్మాజిపేట, ఆగస్టు 13 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పు వచ్చిన తర్వాత ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి హైదరాబాద్ వస్తున్న నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలికేందుకు మంగళవారం తిమ్మాజిపేట మండలం నుంచి ఎస్సీలు(మాదిగలు) హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సమావేశం నిర్వహించి, మందకృష్ణ మాదిగ పోరాటం వల్లే వర్గీకరణకు సుప్రీం కోర్టులో అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

తిమ్మాజిపేట, ఆగస్టు 13 : తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లిలో ఓ మహిళ చెరువులో పడి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం మేరకు గ్రామంలోని నడుపులమ్మ చెరువులో ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మహిళకు 40 నుంచి 45 వయస్సు వరకు ఉండోచ్చని, ఆమె ఎవరైందనేది తెలియడం లేదని పేర్కొన్నారు. ఎవరైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

కేసు నమోదు

బల్మూరు, ఆగస్టు 13 : మండలంలోని పోలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై గురుస్వామి మంగళవారం తెలిపారు. లలిత ఈనెల 8వ తేదీన తన భర్తతో గొడవ పడుతుండగా లలిత చెల్లెలు ఇటుక పెల్లతో తనపై దాడి చేసి గాయపర్చినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. కాశమ్మపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిబ్బందిని నియమించాలి

ఉప్పునుంతల, ఆగస్టు 13 : ఉప్పునుంతల 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్ అన్నారు. మంగళవారం బీజేపీ నాయకుల బృందం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన మధ్యాహ్న భోజనం పెట్టడంలేదన్నారు. వంట ఏజెన్సీలకు 8 నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. పేరుకు మాత్రమే 30 పడకల దవాఖాన ఉన్నా సరిపడే సిబ్బందిని నియమించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, మహేశ్‌యాదవ్, శేఖర్, శివశంకర్, రాజు, సైదులు, శ్రీను పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం

కల్వకుర్తిరూరల్, ఆగస్టు 13 : కల్వకుర్తి టీఎస్ఆర్టీసీ డిపో ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తామని కల్వకుర్తి ఆర్టీసీ డీఎం సుభాషిణి అన్నారు. మంగళవారం కల్వకుర్తి డిపోలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలువురి నుంచి 9 సలహాలు, సూచనలు స్వీకరించామని తెలిపారు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు ఉన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

• షీటీం జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మి

నాగర్‌కర్నూల్‌టౌన్, ఆగస్టు 13 : మహిళలు, విద్యార్థినులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి బెదిరింపులకు భయపడొద్దని షీటీం జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని మంతటి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన షీటీం అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణంలో ఉన్న అమ్మాయిలు, మహిళలు ఈ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకొని ప్రయాణంలో ఉన్నప్పుడు తప్పక ఉపయోగించాలన్నారు. ఈ సమాజంలో మహిళలు, బాలికలు తెలిసిన వారితోనే ఎక్కువగా వేధింపులకు గురవుతున్నారని, జాగ్రత్తగా ఉండాలే తప్పా అధైర్య పడవద్దన్నారు. షీ టీంను సంప్రదించి ఫిర్యాదు చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి ఆకతాయిల ఆట కట్టించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. బాధితులు 100 లేదా 8712657676 ఫోన్‌కు తెలుపాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు వెంకటయ్య, భరోసా కోఆర్డినేటర్ శ్రీలత, విద్యార్థులు ఉన్నారు.

ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

• ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పర్వతాలు

సమావేశంలో మాట్లాడుతున్న పర్వతాలు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 13 : వైద్య రంగంలో పనిచేస్తున్న ఆశ వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశకార్యకర్తల జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టడం జరిగిందని, పది నెలలైనా వారి సమస్యల గురించి ప్రభుత్వం మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న తమకు వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు రామయ్య, కోశాధికారి అశోక్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, అధ్యక్షురాలు కళావతి, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, శివలీల, వరలక్ష్మి, భాగ్యమ్మ, రాధా, కృష్ణవేణి, అలివేల, మంజుల పాల్గొన్నారు.

వైద్య సేవలు జీవితకాలం గుర్తుంటాయి

మాట్లాడుతున్న అదనపు వైద్యాధికారి వెంకటదాసు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 13 : ప్రజలకు వైద్యాధికారులు, సిబ్బంది అందించిన సేవలు జీవితకాలం గుర్తుంటాయని, సంపూర్ణ ఆరోగ్యం పొందేందుకు వైద్యాధికారుల సేవలు, సలహాలు ఎంతో ముఖ్యమని జిల్లా అదనపు వైద్యాధికారి వెంకటదాసు, ఇమ్యూనైజేషన్ అధికారి రవికుమార్‌నాయక్ అన్నారు. మండలంలోని పెద్దముద్దునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసి సాధారణ బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు ఎంపీహెచ్‌ఈవో కేశవులు, ఎంపీహెచ్‌ఎస్ రజితమ్మ, ఏఎంపీహెచ్‌ఎస్ శంకరమ్మ, స్టాఫ్‌నర్సు రేవతి, ఏఎన్‌ఎం లక్ష్మమ్మలకు మంగళవారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో దశరథం పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

అమ్రాబాద్, ఆగస్టు 13 : చెంచు పెంటల్లో నివశిస్తున్న గిరిజనులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వారి ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పరీక్షించి వైద్య సేవలు అందించాలని ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని వటవర్లపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ అడవులు దగ్గరగా ఉన్నందున ప్రస్తుత వర్షకాలంలో ఈగలు, దోమలు, కలుషితమైన నీటిని తాగడంతో చెంచు గిరిజనులు అనారోగ్యానికి గురైయ్యే అవకాశాలు ఉన్నందున వైద్య సిబ్బంది వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అభిలాశ్, కమ్యూనిటీ హెల్త్ ఆధికారి అశోక్‌ప్రసాద్, డీపీఎంవో మధుమోహన్, వైద్య సిబ్బంది రాజేశ్, సరోజ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

పెంట్లవెల్లి, ఆగస్టు 13 : ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆయన కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల ముందు గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి తర్వాత పటించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అలాగే కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమంతు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి చిట్టెమ్మ, నాయకులు మహేశ్, చందు, లక్ష్మి, చెన్నమ్మ, పద్మ, నర్సింహ, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

ఉప్పునుంతల, ఆగస్టు 13 : గంజాయి రహిత సమాజంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్సై లెనిన్ అన్నారు. మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం, అవసరమన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సైదులు, నాగరాజు, శేఖర్, సాయి, ఆంజనేయులు, రాములు, కొండల్ పాల్గొన్నారు.

వర్షానికి విరిగిన చెట్లు

తిమ్మాజిపేట, ఆగస్టు 13 : తిమ్మాజిపేట మండలం చేగుంటలో మంగళవారం గాలులతో కూడిన వర్షానికి ఓ చెట్టు విరిగి కరెంట్ స్తంభంపై పడడంతో గ్రామంలో విద్యుత్ సరఫరా, రాకపోకలకు ఇబ్బందులు ఏర్పాడ్డాయి. స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు సమీపంలో చెట్టు విరిగి 11కేవీ లైన్‌పై పడడంతో సరఫరా దాదాపు 3 గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు చెట్టును తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.

చెంచు పిల్లలతో వెట్టిచాకిరీ!

• తల్లి మంటల్లో గాయపడినా చూసేందుకు పంపని ఇద్దరు
• పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చెంచుపెంటలో వదిలివెళ్లిన వైనం

కొల్లాపూర్, ఆగస్టు 13 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామంలో మైనర్ చెంచు పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారనే ఘటన కలకలం రేపింది. మేదరబండ పెంటకు చెందిన తిరుగుడు మశమ్మకు 12 మంది పిల్లలు. దీంతో వారిని పోషించుకోలేని పరిస్థితి ఏర్పడింది. అప్పటికే రక్తహీనతతో పౌష్టికాహారం కరువై నలుగురు పిల్లలు మృతి చెందారు. కరోనా సమయంలో ఒకరిని ఇతరులకు విక్రయించినట్లు, మరో ఇద్దరు హైదరాబాద్‌లో.. మరొకరు పెండ్లి చేసుకొని వీరికి దూరంగా వెళ్లినట్లు తెలిసింది. మరో నలుగురు మైనర్లైన బక్కన్న (15), మల్లేశ్ (13), కురుమయ్య (10), బయన్నను గొర్రెల కాపరులుగా ముక్కిడిగుండం గ్రామానికి చెందిన ఓరె శివయ్య, సాయికృష్ణ వెట్టిచాకిరీ చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మహిళను పొలాలకు కాపలా పెట్టుకోగా.. 15 రోజుల కిందట ఆమె జొన్న పంట వద్ద వేసిన మంటలో ప్రమాదవశాత్తు పడి గాయాలపాలైంది. దీంతో ఆమెను మేదరబండ పెంటలోని గుడిసెలో వారు వదిలేసి వెళ్లారు. తల్లి మంటల్లో తీవ్రంగా గాయపడినా చికిత్సకు నోచుకోలేదు. కనీసం పిల్లలను కూడా తల్లిని చూసేందుకు పంపించలేదని సమాచారం. శనివారం మశమ్మ ఆమె అన్న కొడుకు లింగస్వామి చూసేందుకు గుడిసె వద్దకు వెళ్లగా దుర్గంధం రావడం.. చావుబతుకుల్లో ఉండడాన్ని చూసి వెంటనే అదే రోజు మధ్యరాత్రి అంబులెన్స్‌లో కొల్లాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నాగర్‌కర్నూల్ జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ప్రజా సంఘాల నాయకులు గ్రామానికి వెళ్లి నిజనిర్ధారణ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నలుగురు పిల్లలను ఆదివారం సదరు ఇద్దరు వ్యక్తులు చెంచు పెంటలో వదిలివెళ్లారు. తర్వాత స్థానికుల సహకారంతో తల్లిని చూసేందుకు వారు దవాఖానకు వచ్చారు. అయితే మశమ్మ పేరుపై 3 ఎకరాల 5 గుంటల భూమి ఉందని, ఈ భూమిని ఆక్రమించుకునేందుకు వారు పన్నాగం పన్నినట్లు పలువురు ఆరోపించారు. సంబంధిత అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తప్పిపోయి వచ్చిన బాలుడిని బాలసదన్‌లో చేర్చిన ఎస్సై

అచ్చంపేటటౌన్, ఆగస్టు 13 : అచ్చంపేట పట్టణానికి గుర్తుతెలియని బాలుడు రావడంతో విధుల్లో ఉన్న పోలీసులు బాలుడిని గమనించి స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. బాలుడి వివరాలను తెలుసుకున్న స్థానిక ఎస్సై ఇందిర బాలుడిని పేరు నరసింహ అని తల్లి పద్మ అని తమది ఖిల్లాఘనపూర్ గ్రామమని బాలుడు పోలీసులకు సమాచారం అందించినట్లు ఎస్సై తెలిపారు. బాలుడి రక్షణ కోసం పట్టణంలోని బాలసదనంలో రెండు జతల కొత్త బట్టలను ఇప్పించి బాలసదన్ ఇన్‌చార్జికి బాలుడి సంరక్షణ నిమిత్తం అప్పజెప్పారు. బాలుడికి సంబంధించిన బంధువులు కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే అచ్చంపేట పోలీసు స్టేషన్ 9494885326 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని ఆమె సూచించారు.

అచ్చంపేటకు చేరుకున్న బాలుడు

పాఠశాలకు మౌలిక సదుపాయాలు

విద్యార్థులకు అందించడానికి సిద్ధంగా ఉంచిన సామగ్రి

అచ్చంపేటరూరల్, ఆగస్టు 13 : మండలంలోని పల్కపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు దాతల సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పించారు. డిజిటల్ తరగతుల కోసం ప్రొజెక్టరు గుజ్జ రాజవర్ధన్‌రెడ్డి, భోజనం చేసే పళ్లాలు గుజ్జనారాయణ రెడ్డి, మల్టీ స్పీకర్లు గొర్ల తిరుపతయ్య, బూట్లు గుజ్జబాల్ రెడ్డి, వల్లపు దివ్య, సత్యనారాయణ, ప్రొజెక్టర్ స్క్రీన్ ఏఆర్‌రెడ్డి, టై, బెల్ట్‌లు వల్లపు సంతోష్ రెడ్డి, ఈరమొల్ల రాములు, బ్యాడ్జీలు కంది శ్రీశైలం వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం చేయుతను అందించిన దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీల్కిస్, తిరుపతయ్య గౌడ్, కల్పన, శేఖర్, విద్యార్థులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.